# రెండో ఆలోచన

- పి.వి.బి.శ్రీరామమూర్తి

రాజమండ్రి స్టేషన్‌లో రైలాగింది.

కంపార్ట్‌మెంటు ఎక్కే దిగే జనంతో కోలాహలంగా ఉంది.

సమయం మధ్యాహ్నం ఒంటిగంట అయిందేమో అందరూ భోజనాల హడావుడిలో ఉన్నారు. ఎక్కడో తుపాన్ పెట్టినట్లుంది. ఆకాశంలో మబ్బులు సూర్యుణ్ణి మింగేసాయి. చిన్న చిన్న చినుకులు. కిటికీలోంచి తుంపరలు. చల్లని గాలి.

మహాలక్ష్మికి తెలివి వచ్చేసింది.

"ఏమండీ! ఎక్కడికొచ్చేం?" కిటికీలోంచి బయటకు చూస్తూ అడిగింది. నారాయణరావు పుస్తకంలో లీనమయిపోయాడేమో, అతనికి ఆ మాటలు వినిపించినట్టులేదు.

"మిమ్మల్నే అడిగేది? మనం ఇప్పుడెక్కడికి వచ్చాం?" అంది.

"ఏంటోయ్! ఇంకా హైదరాబాద్‌కి చాలా టైముంది."

"అదిసరే, ఇదే స్టేషనూ అంట?"

"అదా?.." అని కిటికీలోంచి తొంగి చూసి "కనపళ్ళా? అంత పెద్ద బోర్డు.. రాజమండ్రి. స్టేషను" అన్నాడు.

"ఇప్పుడు టైమెంతయిందో తెలుసా?"

"ఒంటి గంటయింది అంతే. ఏంటట?"

"అదే మరి- ఇంకా ఆకలి వెయ్యట్లేదా?"

"ఒక్క పది నిమిషాలాగు. ఈ 'ఎడిటోరియల్' అయిటం అయిపోనీ."

"ఆ పేపరు మనదే. ఎక్కడికీ పోదు. ముందు భోజనం కానివ్వండి. నాకు కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి. అయినా ట్రైన్ జర్నీ మీతో పెట్టుకోవటం ఏంటి నా ఖర్మగానీ!" అని బెర్త్ క్రిందకి వంగి మీల్సు బేగ్ తీసింది. భర్త చేతిలో పేపరులాగి, ప్రక్కకి విసిరేసి, కంచంలో పులిహోర పెట్టి అందించింది. పులిహోర తినేసి, వాష్ బేసిన్ దగ్గరకెళ్ళి చేతులు కడుక్కొని వచ్చిన నారాయణరావుకి పది సంవత్సరాల కుర్రాడు కంటపడ్డాడు.

ఆ అబ్బాయి విశాఖపట్నం నుండి అలానే కూర్చున్నాడు. వాడిలో చలనం లేనట్లే ఉంది. వాడి ముఖంలో ఏదో దిగులు కనిపిస్తోంది. కనీసం మంచినీళ్ళకయినా లేచినట్టులేదు.

"రేయ్, నువ్విక్కణ్ణించి పో. ఇందాకట్నించి చూస్తున్నా. కదలవేంటి?" అని బెర్త్‌మీద నుండి ఒక అరవై ఏళ్ళ పెద్దాయన కేకలేస్తున్నాడు.

వాడేం సమాధానం చెప్పలేదు. అక్కణ్ణుంచి కొంచెం కదిలి ముందుకెళ్ళాడు.

"ఏయ్, ఇక్కడ మా బూట్లున్నాయ్. సూట్‌కేసులున్నాయి. అటు పో!" అని మళ్ళీ ఆయన కళ్ళతో గొంగళిపురుగును తోసేసినట్లు తోసేసాడు.

వాడు మరికొంచెం ముందుకు డేకిరాడు. వాడిలో కోపంలేదు. చిరాకులేదు. దుఃఖం లేదు. కొంచెం దిగులుంది. ఏదో ఆలోచిస్తున్నాడు. ఏదో భయం వెన్నంటి- తరుముతోన్న దిగులు. గమ్యం తెలీని ప్రయాణపు ఆలోచన.

"ఏరా, అబ్బాయ్, ఆకలేస్తోందా?" నారాయణరావులో మానవత్వం ప్రశ్నించింది.

వాడు అడ్డంగా తలూపాడు.

"ఏంటీ? ఆకలి లేదా? విశాఖపట్నం నుండి చూస్తున్నాను. ఎక్కడా ఏం తినలేదు. తాగలేదు. నీకాకలి వెయ్యటంలేదా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"వాడికి ఆకలికాదండి. మనం అందరం కళ్ళు మూసి కునుకుతీస్తే.. చేతికందేది పట్టుకుని ఉడాయిస్తాడు. ఇలాటి వెధవలకి ఓ గేంగ్ మాస్టరుంటాడు. ఏ విజయవాడలోనో వాడు వీళ్ళని కలిసి.. అన్నీ కలెక్టు చేసుకుంటాడు. వీళ్ళకి పాతికో.. యాభయ్యో విసిరేస్తాడు" తనకంతా తెలిసినట్లే చెప్పాడు మరో ఆయన. అయినా ఆ కుర్రాడిలో చలనం లేదు.

"ఒరే.. ఇలారా!" నారాయణరావు పిలిచాడు.

వాడు లేచి వెళ్ళాడు. నారాయణరావు పర్సులోంచి అయిదు రూపాయల బిళ్ళ తీసాడు.

"ఏ.. ఏంటి? అయిదు రూపాయలు వాడికేనా?" అని మహాలక్ష్మి నారాయణరావు చేతిని వెనక్కి లాగింది.

"అబ్బ. నువ్వుండవోయ్. రేయ్ ఏదేనా కొనుక్కు తిను" అన్నాడు.

"వద్దుసార్!"

"అరే.. తీసుకొని.. కొనుక్కోరా! ఆకలితో ఎంత సేపు వుండగలవ్?"

"నాకాకలి లేదుసార్!"

"ఏం? అమృతం తాగేవా?"

"అమృతం ఇవ్వటానికి నాకమ్మలేద్సార్!"

వాడి మాటలకి ఎదర సీటులో కూర్చున్న అప్పుడే తలనెరుస్తోన్న స్త్రీ, హృదయంలో సుడిగుండాలు చెలరేగాయి. కలుక్కుమంది. "ఏమండీ ఆ కేరియర్ అందుకోండి" అంది.

ఆమె భర్త కేరియర్ అందిచ్చాడు. గబగబా కేరియర్ విప్పి విస్తరాకు చించి పెరుగన్నం కలిపింది ఆవకాయ ముక్క తీసింది. విస్తర చివర వేసింది.

"బాబూ! ఇట్రా. నేను పెడతా అమృతం" అంది.

వాడి కళ్ళలో జ్యోతులు వెలిగాయి. చిక్కటి చీకటిలో ఒంటరి నక్షత్రపు కాంతులు కనిపించాయి. ఆకాశాన్ని చీల్చుకుంటూ జిగేలుమన్న మెరుపు కనిపించింది. రెండుచేతులూ జోడించి నమస్కారం చేసి "వద్దమ్మా, నాకు ఆకలిగాలేదు" అన్నాడు.

ఆమె భర్త వెళ్ళి ఆ కుర్రాణ్ణి తీసుకొచ్చి బెర్త్‌మీద కూర్చోబెట్టాడు.

"ఏంటీ! ఆ కేడీనాకొడుకును అంత మర్యాద చేస్తున్ను. ఇలాటోళ్ళి.. లచ్చుమందిని రోజూ సూస్తనే ఉంటాం మేం!" అన్నాడో జబర్దస్తీ మనిషి.

నారాయణరావు అయిదు రూపాయలు బిళ్ళ పర్సులో పెట్టేసాడు. అతనిలో కూడా కుర్రాడి మీద పూర్తి నమ్మకం ఏర్పళ్ళేదు. తెల్లార్లేస్తే ఈ పొట్టకూటి విద్యలెన్నో చూస్తునే ఉంటాం అనుకున్నాడు.

విస్తరిలో పెరుగన్నం తినమని ఆ కుర్రాడికి చెప్పిందా పెద్దామె.

"ఇవాళ మీరు నా ఆకలి తీరుస్తారు. రేపెవరు తీరుస్తారు.. ఈరోజు ఇలా తిండం అలవాటయిపోయి.. రేపట్నించి నాకడుక్కుతిండమే అలవాటైపోద్ది. అందుకని.."

ఆ మాటలనేసరికి ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎక్కడో ఏదో కలుక్కుమంది. రక్తసంబంధం కాకపోయినా.. మానవత్వపు సంకెళ్ళు ఆమెను కట్టిపడేసాయి. వాడి మాసిన నిక్కరు.. చిరిగిన బనీను.. చెదరిన జుట్టు.. చెమట వాసన.. అవేవీ ఆమెకు వాణ్ణి దూరం చెయ్యలేకపోయాయి. వాడి భుజం మీద చెయ్యివేసి దగ్గరగా తీసుకుంది.

"చెప్పు బాబూ! నీకెవరూ లేరా? నీదే ఊరు?" అని వాణ్ణి వివరాలడిగింది.

వాడి కళ్ళలో నీళ్ళు. ఆ నీటి పొరల్లో...

"అయ్యల్లారా! దరమ పెబువుల్లారా! అమ్మల్లారా! మీకందరికీ.. నా వందనాలు! సూడండి.. మీరూ రాల్చిన ఒక రూపాయి.. ఒక రెండు రూపాయలు.. ఇంకా, మానుబావులిచ్చిన అయిదురూపాయిలూ.. మీరిచ్చిన ఈ డబ్బుల్తో నేను.. నా భార్యా.. నా బిడ్డలు.. కడుపునిండా తిని.. కంటి

నిండా సుకంగా నిద్రపోతాం!

ఈనాడు మీరు సేసిన దానదర్మమే.. మీ బిడ్డలకు మంచి.. బతుకునిస్తాది. మీరు సేసిన దానదర్మాలే.. మాకూ సక్కని బతుకును ఇస్తాది. అయ్యలారా! మీకు తోసిన దానం సెయ్యండి. ఆ బగమంతుడు మిమ్మల్నీ రచ్చిస్తాడు.''

"హరే.. బాయ్.. ఈ బిడ్డ వొయసెంతరా!''

"మూడు సంవసరాలు.''

"మూడు సంవసరాల పిల్ల మాటలు ఆడగ ల్దట్రా?''

"మాటా ఆళ్ళేదు.''

"మరి ఈ బిడ్డా ఏటి సేత్తాదిరా?''

"హరే.. దరమపెబువుల్లారా! ఇది.. సిన్నబిడ్డ.. ఇది పన్నెండడుగుల ఈ కఱ్ఱ మీదకి ఎక్కి.. అక్కడా పీట మీద ఒంటికాలిమీద నిలబడి డేన్స్ సేస్తది!''

"అరె.. ఏం డేన్స్ సేస్తదిరా!''

"సిరంజీవినాగా సేస్తది. మంజువాణి నాగా సేస్తది.. బేక్‌డాన్స్ సేస్తది.''

"నిజమేనంటావా?''

"నిజమే.''

"అయితే బేటి సేసి సూపు'' అన్నాడు.

మూడు సంవత్సరాల పిల్ల గబగబా ఆ కఱ్ఱ ఎక్కేసింది తాటి సాయంతో. ఎప్పటి లాగే గబగబా పీట ఎక్కి డేన్స్ చేస్తోంది. తండ్రి డప్పు కొడుతున్నాడు. ఈల వేస్తున్నాడు. అందరూ రూపాయిలు, రెళ్ళు.. విసురుతున్నారు. రోజూకంటే ఎక్కువ మొత్తం వసూలు అయింది.

కానీ దురదృష్టం వెక్కిరించింది. ఆ పిల్లకి రాత్రి జ్వరం వచ్చింది. పొద్దున్న అన్నం తిన లేదు. టిఫిన్ కూడా చెయ్యలేదు. కళ్ళు తిరిగాయి. అడుగెక్కడ పడుతోందో దానికే తెలీలేదు. ఆ పిల్ల ఏమాత్రం తప్పుచేసినా అడుగుని దెబ్బతగలకుండా పట్టుకునే బాధ్యత పదేళ్ళ కుఱ్ఱాడిది. కానీ రాత్రి వాడు 'కడుపునిండా' తినలేదు. పొద్దున్న టిఫిన్ కూడా లేదేమో.. రాలుతోన్న డబ్బులు రేపిన అలజడిలో వాడు మీదనుండి క్రింద పడిపోతున్న పిల్లని కానుకోలేకపోయాడు.

అంతే..

ఆమె క్రింద పడింది. రక్తపు మడుగులో నేలకంటుకుపోయింది. ఇది జరిగిన తరువాత ఆ కుఱ్ఱాడికేం జరుగుతోందో తెలుసు. అందుకే- జనం మధ్య లోంచి చల్లగా జారుకుని.. స్టేషన్‌కి చేరుకున్నాడు. ఎక్కడికెళ్ళాలో తెలీక.. కదులుతున్న రైలెక్కేసాడు.

- వాడు చెప్పిన కథ అందర్నీ కదిలించింది.

"కథలు బాగానే చెప్తున్నాడే'' అన్నారు కొందరు.

ట్రైన్ గోదావరి చేరుకుంది.

"ఒరే అబ్బాయి.. నీ తల్లికి చెప్పి రాలేకపోయావా?''

"నా తల్లి నా ఏడేళ్ళప్పుడు సనిపోయిందండి'' అన్నాడు కళ్ళనీళ్ళతో.

"సరే.. ఇదిగో.. ఈ డబ్బులు పట్టుకెళ్ళి ఓ డజను అరటిపళ్ళు, ఓ అరకేజీ ద్రాక్షపళ్ళు పట్రారా! వేగిరం వచ్చేయిమీ. బండి కదిలిపోతుంది'' అని వందరూపాయి లిచ్చాడా పెద్దాయన. వాడు వెళ్ళాడు. పది నిమిషాలయింది. వాడు రాలేదు. బండి కదిలిపోయింది. అందరూ ఆ పెద్దాయనను చూసి నవ్వుతున్నారు.



'ఇతగాడు టోకరా తిన్నాడు' అనుకున్నారు. కొందరు బయటకే అనేసారు.

అతను మాత్రం ఏం మాట్లాడలేదు. అరగంట గడిచింది. మరో స్టేషన్లో బండి ఆగింది. అతను మాత్రం కునుకు తీస్తున్నాడు. ఆమె మాత్రం ఆ కుఱ్ఱాడెందుకు రాలేదా అని ఆలోచిస్తోంది. కొంప తీసి బండి కదిలిపోతే ఎక్కలేకపోయాడా? కాలు జారి పడిపోయాడో? అని పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది.

"ఏమండీ, ఈ అబ్బాయి ఏమయి ఉంటాడు?'' అంది బయటకు.

"ఏముందీ? వంద చేతిలో పడిందిగా. ఉడాయించేసి ఉంటాడు'' అన్నారు నారాయణరావు దంపతులు. అందరూ ఈ దంపతులు మరెప్పుడూ మోసపోకుండా బుద్ధివచ్చేలా చేసాడన్నారు.

అయినా వాళ్ళిద్దరూ ఎవరితోనూ గొంతు కలప లేదు. రెండు స్టేషన్లు దాటాయి. ఏదో ట్రైన్ క్రాసింగ్. ట్రైన్ ఆగిపోయింది. పదినిమిషాల్లో ఆ కుఱ్ఱాడు వచ్చాడు.

"బాబుగారూ! ఇదిగో పళ్ళు. మిగిలిన డబ్బులివిగోనండి. ఆడు చిల్లర నేటు చేసాడు. బండి కదిలిపోయింది. సివారి పెట్టెక్కేసాను. ఏ టేసన్లోనూ ఎక్కువసేపాగనేదు. అందుకే ఆలీసమైపోనాది'' అన్నాడు ఆయాసపడిపోతూ, ఆలస్యానికి కారణం చెపుతూ.

ఆమెకెందుకో వాడు 'దొంగ కాదని' గట్టి నమ్మకం ఉంది. ఆ నమ్మకం నిజమైంది. ఆ ఆనందంతో వాణ్ణి దగ్గరకు తీసుకుంది. అరటిపండు వొలిచి వాడికిచ్చింది. వద్దంటున్నా తినిపించింది. నీళ్ళు త్రాగాడు. ట్రైన్ వేగం పుంజుకుంది. అందరూ మౌనంగా వుండిపోయారు.

"ఏరా, నాతో వచ్చేస్తావా? బళ్ళో వేసేస్తాను. బాగా చదూకుందువుగానీ.'' వాడు తటపటాయించాడు.

"పరవాలేదు. మా పిల్లలు పెద్దవాళ్ళయి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నీకే ఇబ్బందీ ఉండదు. వచ్చేసెయ్'' అందామె.

వాడానందంతో తలూపాడు. ఊహించని అదృష్టానికి ఉప్పొంగిపోయాడు. ఆమె ద్రాక్షపళ్ళు ఇచ్చింది. వాడు కాదన్లేదు. అందుకున్నాడు. వాడి కళ్ళలో సన్నజాజులు విరిసాయి. వాళ్ళు విజయవాడలో దిగిపోయారు. ఆ కుఱ్ఱాడూ వాళ్ళ వెనకాల వాళ్ళ బేగులు పట్టుకుని దిగాడు.

ఎవరూ పెదవి విప్పి మరోమాటాడలేకపోయారు.

"లక్ష్మీ! చేతులందరికీ ఉంటాయి. కానీ దానధర్మాలు చేసేవి కొందరి చేతులే. ఆలోచనలు అందరికీ ఉంటాయి. ఆచరణలో పెట్టగలిగేది కొంత మందే సుమా!'' అన్నాడు నారాయణరావు సన్నని బాధ గుండెను గుచ్చగా. ఆ మాటలు వినినట్టే కళ్ళు మూసుకుంది మహాలక్ష్మి.

★